ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 03.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పిల్లల సైబర్ భద్రత కోసం పాఠశాలలు, పోలీసులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాల్సా దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో పిలుపునిచ్చారు.
2. హైదరాబాద్‌లోని తార్నాక CSIR-IICT ఆడిటోరియంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అధ్యక్షతన 'ప్రారంభంయిన దిశా' కమిటీ సమావేశం కొనసాగుతోంది.
3. ఆర్‌టీసీ-మెట్రో కామన్ పాస్ ద్వారా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు మెట్రో, బస్సులో ప్రయాణించారు. ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు ఈ పాస్ లు తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు.
4. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రార్థన మందిరంపై జరిగిన దాడిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ ఆయన చేశారు.

-------------------------------

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్ తార్నాకలోని CSIR-IICT ఆడిటోరియంలో 'దిశా' కమిటీ సమావేశం కొనసాగుతోంది. కేంద్రమంత్రి, దిశా ఛైర్మన్ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ భేటీకి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, కలెక్టర్ ప్రియాంక తదితర అధికారులు హాజరయ్యారు. నగరంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగంపై ఇందులో సమగ్రంగా

సమీక్షిస్తున్నారు. ఈ సమావేశం ద్వారా హైదరాబాద్ పరిధిలోని అభివృద్ధి పనులకు మరింత ఊతం లభించనుంది.

**డెస్క్**

------------------------------

**ముఖ్యమంత్రి**

హైదరాబాద్‌లో జరిగిన నాల్సా దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పిల్లల సైబర్ భద్రత అత్యంత ముఖ్యమైన అంశమని, ఆన్‌లైన్ నేరాల నుంచి పిల్లలను కాపాడేందుకు పాఠశాలలు, పోలీసులు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని, భరోసా కేంద్రాలు, సైబర్ ల్యాబ్‌ల ద్వారా చర్యలు చేపడుతోందని తెలిపారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం సమగ్ర 'చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్' సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ 1930, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు.

**డెస్క్**

------------------------------

**గవర్నర్ - స్మిత్ మచ్చర్**

ప్రమాదకర పరిస్థితుల్లో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలను తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రశంసించారు. విమాన ప్రమాద క్షణాల్లో కెప్టెన్ చూపిన అప్రమత్తత, సమయస్ఫూర్తి వల్లనే అసాధ్యమనుకున్న పరిస్థితి నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని కొనియాడారు. ఆయన చూపిన తెగువ దేశానికే గర్వకారణమని పేర్కొన్న గవర్నర్, కెప్టెన్ స్మిత్ మచ్చర్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ సేవలందించాలని ఆకాంక్షించారు.

**డెస్క్**

----------------------------

**చిరంజీవి – స్మిత్ మచ్చర్**

ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ ఘటనపై సినీ నటుడు చిరంజీవి స్పందిస్తూ, ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు కురిపించారు. గాయపడిన స్థితిలోనూ సమయస్ఫూర్తితో పోరాడిన ఆయన సాహసం ప్రతి భారతీయుడికీ గర్వకారణమన్నారు. ఆ విపత్కర సమయంలో కెప్టెన్ హనుమాన్ చాలీసా పఠిస్తూ ధైర్యాన్ని కూడగట్టుకోవడం తనను కదిలించిందని పేర్కొన్న చిరంజీవి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆంజనేయస్వామిని ప్రార్థించారు.

**డెస్క్**

------------------------

**ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి.గితెతో కలిసి ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం క్రీడాకారుల ప్రోత్సాహానికి, గ్రామీణ క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

**బైట్: ఆది శ్రీనివాస్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**డీకే అరుణ**

సమాజ ఆరోగ్య పరిరక్షణతో పాటు మహిళలు, చిన్నారుల సంక్షేమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయమని ఎంపీ డీకే అరుణ అన్నారు. నారాయణపేట, ధన్వాడలలో నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందిని సన్మానించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్

నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**పీటీసీ - మహబూబ్ నగర్**

----------------------------

**రోడ్డు ప్రమాదం**

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో కేసారం నుంచి అంత్యక్రియలకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడి పలువురు మృతి చెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**డెస్క్**

------------------------------

**మెట్రో పాస్ మంత్రులు**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆర్‌టీసీ-మెట్రో కామన్ పాస్ ద్వారా బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు మెట్రోలో, అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్‌కు ప్రయాణించారు. ప్రజారవాణాను సులభతరం చేసేందుకే ఈ కామన్ పాస్ విధానాన్ని తెచ్చామని, భవిష్యత్తులో లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం ఆటోలు, క్యాబ్‌లను కూడా అనుసంధానిస్తామని భట్టి తెలిపారు. ఈ వ్యవస్థ ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

**డెస్క్**

--------------------------

**రామచందర్ రావు**

దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రార్థన మందిరంపై జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. బాధితులను పరామర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన ఆయన, ఇది ముమ్మాటికీ ముందస్తు కుట్రలో భాగమేనని స్పష్టం చేశారు. వరుసగా ప్రార్థనా మందిరాలపై దాడులు జరుగుతున్నా, ప్రతిసారీ నిందితులకు మతిస్థిమితం లేదని చెప్తూ పోలీసులు కేసులను పక్కదారి పట్టించడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

డెస్క్

--------------------------

**బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

నిన్న మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేళ బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. 'సేవ్ డెమోక్రసీ మార్చ్' ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాదని, తమ కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడానికేనని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ప్రజలు పదేపదే తిరస్కరిస్తున్నా జీర్ణించుకోలేక, ఈవీఎంలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, తెలంగాణల్లో గెలిస్తే ప్రజా తీర్పు అని, ఓడిపోతే ఈవీఎంల లోపమనడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని స్పష్టం చేశారు.

డెస్క్

-------------------------

**కన్హా శాంతివనం**

హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఐఎఫ్ఎఫ్ సిఓ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్త రైతులు, సహకార సంఘాల ప్రతినిధుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎఫ్ఎఫ్ సిఓ చైర్మన్ దిలీప్ సంఘానీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని, నానో ఎరువులు, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. రైతుల ఆదాయాన్ని

పెంచేందుకు, సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ప్రతినిధులు స్పష్టం చేశారు.

**డెస్క్**

-------------------------

**కోర్ అర్బన్ రీజియన్ చట్టం**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పట్టణ పాలన కోసం 'కోర్ అర్బన్ రీజియన్ చట్టం-2026' అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలతో కూడిన నూతన వ్యవస్థకు గెజిట్ ద్వారా చట్టబద్ధత కల్పించింది. ఈ చట్టం ద్వారా ఆస్తి పన్ను విధింపులో క్యాపిటల్ వాల్యూ సిస్టమ్ అమల్లోకి రానుంది. అక్రమ నిర్మాణాలు, చెరువుల పరిరక్షణ, మౌలిక వసతుల కల్పనలో కీలక మార్పులకు ఇది నాంది పలికింది.

**డెస్క్**

-------------------------

**ఆసిఫాబాద్ నవోదయ**

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2027-28 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల లేటరల్ ఎంట్రీ ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు డీఈఓ సచ్చితానంద చారి, ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. అర్హులైన విద్యార్థులు నిర్ణీత వెబ్‌సైట్ల ద్వారా ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 10న జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీటీసీ - **ఆసిఫాబాద్**

------------------------------

**VBG RAM G**

గ్రామాల్లో చేపట్టిన వీబీ జీరాంజీ పనుల్లో వేగం పెంచాలని మంచిర్యాల డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మరాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.. హాజీపూర్ మండలం

దొనబండలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన జలసిరి పనులను సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ, సేకరణ నిబంధనల మేరకు చేయాలన్నారు.

**పీటీసీ - మంచిర్యాల**

--------------------------------

**నల్గొండ సోలార్ విద్యుత్**

ప్రజలు సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకొ నేందుకు ముందుకురావాలని సూర్యాపేట జిల్లా విద్యుత్తు ఎస్ఈ యాదగిరి కోరారు. సూర్యాపేటలోని విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో 'పీఎం సూర్యఘర్ ముక్త్ బిజిలి యోజన' పథకంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.... ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటి జల విద్యుత్తు, బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ స్టేషన్ కు బొగ్గు కొరత ఏర్పడి విద్యుత్తు ఉత్పత్తి గణనీయంగా తగ్గిందన్నారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------------

**ఆసిఫాబాద్ ఉచిత శిక్షణ**

ఆసిఫాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు అన్ని రకాలుగా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఇస్తున్న ఉచిత శిక్షణకు సంబంధించి విద్యార్థులకు డీఎస్పీ అశోక్, సిఐలు సతీష్, రవి, రవీందర్ లతో కలిసి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నీతిక పంత్ మాట్లాడుతూ......

**బైట్ - నీతిక పంత్, జిల్లా ఎస్పీ**

**పీటీసీ - ఆసిఫాబాద్**

--------------------------------